సాక్షి
నిర్మల్
మంగళవారం । 23 । జూలై । 2024



సర్కారు బడుల్లో శిక్షా సప్తాహ్

నూతన విద్యావిధానం అమలులోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని సర్కారు బడుల్లో సోమవారం నుంచి శిక్షా సప్తాహ్ నిర్వహిస్తున్నారు. 8లో▸



ఆర్టీసీకి పెరిగిన ప్రజాదరణ

ఆర్టీసీకి ప్రజల్లో ఆదరణ పెరిగిందని దీంతో ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) 90శాతం నమోదవుతుందని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమాన్ అన్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
27.5 /24.5

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. అల్పపీడనం ప్రభావంతో చాలాప్రాంతాల్లో ఈదురుగాలులతో వర్షం కురిసే అవకాశం ఉంది.

ఒక్క రోడ్డూ సక్కగ లేదు!

'మున్సిపల్' ఎదుటే..



జిల్లాకేంద్రంలో రోడ్లు ఎంత దారుణంగా ఉన్నాయో.. ఈ చిత్రం కళ్లకు కడుతుంది. ఈ ఫొటో స్వాక్షాత్తు జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుటే ఉంది. ఇది నిన్నమొన్నటి వర్షాలకు ఇలా కాలేదు. కొన్నేళ్లుగా ఇలాంటి దుస్థితిలోనే ఉంది. ప్రతీ వర్షాకాలం మరింత దారుణంగా తయారవుతోంది. గుంతలపడి, బురదనీళ్లు నిండి దోమలకూ నివాసమవుతోంది. బల్దియా ముందే ఈ దుస్థితి ఉందంటే.. ఇక పట్టణంలోని గల్లీ రోడ్ల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.



నిర్మల్ పట్టణంలోని ప్రధాన చౌరస్తా శివాజీచౌక్‌లో గుంతలమయమైన రోడ్డు

ఆ శాఖ ఎదుటే..



ఈ చిత్రం జిల్లాకేంద్రంలోని రోడ్లుభవనాలశాఖ కార్యాలయం ఎదుటది. అంతటా రోడ్లు వేసే ఆ శాఖ కార్యాలయానికి వెళ్లాలంటేనే ఇదిగో ఇలా గుంతలు, గతుకులు దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి. ఈ రోడ్డు పొడవునా ఇదే దుస్థితి నెలకొంది.

- జిల్లా కేంద్రం.. గుంతలమయం
- అడుగడుగునా గుంతలే..
- గల్లీరోడ్లు మరీ దారుణం
- ఈ సీజన్‌లో మరిన్ని ఇబ్బందులు

నిత్యం నరకం..

జిల్లా కేంద్రంలోని చైన్‌గేట్ నుంచి బంగల్‌పేట్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టి దాదాపు నాలుగేళ్లు కావస్తోంది. రోడ్డు విస్తరణ పనుల ప్రారంభంలో మున్సిపల్ పాలకవర్గం మొత్తం నిలబడి మరీ.. ఇళ్లు, దుకాణాలను తొలగింపజేశారు. తాము నష్టపోయినా.. అందరికీ మంచే జరుగుతుందని స్థానికులు ఓర్చుకున్నారు. కానీ ఏళ్లు గడుస్తున్నా రోడ్డు పనులు మాత్రం పూర్తి కావడం లేదు. కేవలం చైన్‌గేట్ నుంచి హెడ్ పోస్టాఫీస్ వరకే రోడ్డు వేశారు. అది కూడా ఏడాదికే గుంతలు పడి ఇబ్బందులు పెడుతోంది. ఇక సోమవార్‌పేట్, గాంధీచౌక్, జుమ్మెరాత్‌పేట్, నాయుడివాడ, బేస్తవార్‌పేట్, బంగల్‌పేట్ వరకు, అలాగే గాంధీచౌక్ నుంచి బుధవార్‌పేట్ మీదుగా రహదారులు మొత్తం గుంతలు పడ్డాయి. డ్రైనేజీలను పూర్తిగా కట్టకపోవడంతో మురికినీళ్లు రోడ్ల పైకి వస్తున్నాయి.

నిర్మల్: 'ఏందిది.. నిర్మలేనా..! అడుగడుగుకో గుంత.. అడుగేద్దమంటే బురద.. బండిమీద పోతే బొక్కలరుగుతున్నయ్.. నడుసుకుంటూ పోదమంటే బురదల ఎక్కడ జారిపడతారో తెలియని పరిస్థితి. జిల్లా కేంద్రమన్నట్లే కానీ.. ఒక్క రోడ్డు కూడా సక్కగ లేదు..' జిల్లా కేంద్రంలో ఏ గల్లీకి వెళ్లినా.. ఏరోడ్డు మీద ఆగినా ఇదే ముచ్చట. నిర్మల్ ప్రజలందరూ నిత్యం రోడ్డుకష్టాలు అనుభవిస్తున్నారు. అడుగడుగునా గుంతలరోడ్లతో నరకం చూస్తున్నారు. ఇప్పటికే చాలామంది డిస్క్ సమస్యలు, డస్ట్ ఎలర్జీల బారినపడ్డారు. పాత ఏరియాలతోపాటు జిల్లాకేంద్రంలోని కొత్త కాలనీలు, ప్రధాన రోడ్ల పైనా ఇవే సమస్యలతో సతమతమవుతున్నారు.

ఈ సీజన్‌లో పరేషానే..

మామూలు కాలాల్లోనే జిల్లా కేంద్రంలోని రోడ్లు ఇబ్బందికరంగా ఉంటాయి. ఇక వర్షానికి అంతర్గత రోడ్లన్నీ దారుణంగా మారాయి. ఈ సీజన్‌లో పట్టణంలోని ప్రియదర్శినినగర్, భాగ్యనగర్, ఈద్‌గాం, బాగులవాడ, ద్యాగవాడ, బుధవార్‌పేట్‌లతోపాటు పలు కాలనీల్లో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇక కొత్త కాలనీల్లో పరిస్థితి మరింత దారుణం. మొరం పోసిన రోడ్లన్నీ బురదమయమై నడవడానికి కూడా వీలులేకుండా మారాయి. ఇటీవల కురుస్తున్న వానలకు రోడ్లపై గుంతలు మరింత పెద్దగా మారాయి.

డిస్కులు జారుతున్నాయి..

నిర్మల్ పేరుకు తగ్గట్లు నిర్మలంగా ఉండాలి కానీ.. స్థానికంగా పరిస్థితి వేరుగా ఉంది. గుంతల రోడ్లపై నుంచి నిత్యం ప్రయాణం చేస్తుండటంతో చాలామంది వెన్నుపూస సమస్యలు వస్తున్నాయి. యువకులు సైతం డిస్కుల సమస్యల బారిన పడుతున్నారు. వర్షకాలం గుంతలు ఉంటే.. ఇక మామూలు రోజుల్లో దీనికి అదనంగా దుమ్ముధూళి విపరీతంగా ఉంటోంది. రోడ్డుపనుల పెండింగ్ కారణంగా పాత ఏరియాలు ఇబ్బంది పడుతుంటే.. అసలే రోడ్లు లేక కొత్త కాలనీలు అవస్థలు పడుతున్నాయి. ప్రధాన రహదారులదీ అదే దుస్థితి. ఆర్డీవో ఆఫీస్ నుంచి మున్సిపాలిటీ, ఆర్అండ్‌బీ ఆఫీస్, శరద్‌మహల్, ఫిష్‌మార్కెట్ మీదుగా ఈద్‌గాం వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ మార్గంలో వెళ్లాల్సిన వాళ్లు శివాజీ చౌక్ మీదుగా వెళ్లాల్సి వస్తోంది. ప్రధాన చౌరస్తాగా ఉన్న శివాజీచౌక్‌లోనూ రోడ్డు మొత్తం దెబ్బతింది. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే ఇక ముందు ఎంత దారుణంగా ఉంటుందోనని పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు.

న్యూస్‌రీల్

'స్వర్ణ' నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న ఈఈ లక్ష్మి

సారంగాపూర్: నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని స్వర్ణ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా నీటిపారుదల శాఖ ఈఈ లక్ష్మి ఆయకట్టుకు సోమవారం నీరు విడుదల చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న సమయంలో స్వర్ణ నది పరీవాహక ప్రాంతాల్లోకి పశువుల కాపరులు, మత్స్యకారులు రైతులు వెళ్లకూడదని సూచించారు. ఈఈ వెంట బీజేపీ నాయకులు రాంశంకర్‌రెడ్డి, విలాస్, సాహెబ్‌రావు, పోతన్న, ప్రాజెక్టు ఏఈలు మధుపాల్, దేవేందర్ ఉన్నారు.

రేపు ఎస్‌జీఎఫ్ సమావేశం

నిర్మల్ రూరల్: ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాల క్రీడల క్యాలెండర్ ఖరారు చేయడానికి పాఠశాల క్రీడా సమాఖ్య సమావేశం ఈనెల 24న నిర్వహించనున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి, ఎస్జీఎఫ్ సెక్రటరీ శ్రీనివాస్‌లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాత డీఈవో కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సమావేశానికి జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో పాఠశాల క్రీడల క్యాలెండర్ ఖరారు చేయడం, జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడల సెలక్షన్ నిర్వహణ కోసం ఆసక్తి ఉన్న వ్యాయామ ఉపాధ్యాయులు తమ ప్రతిపాదనలు ప్రధానోపాధ్యాయుల అనుమతితో తీసుకుని రావాలని సూచించారు. వ్యాయామ ఉపాధ్యాయులు హాజరు కావడానికి వీలుగా ప్రధానోపాధ్యాయులు వారిని రిలీవ్ చేయాలని ఆదేశించారు.

బకాయిలు చెల్లించాలి

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్న యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఈద్గాం ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు ప్రక్రియ సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలు, జీపీఎఫ్, టీఎస్ జీఎల్ఐ తదితర బకాయిలు విడుదల చేయాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు జుట్టు గజేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జె.లక్ష్మణ్, ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వరరావు, టి.లఖన్, ప్రధానోపాధ్యాయురాలు నీరజ, ఉపాధ్యాయుడు మోహన్‌రావు పాల్గొన్నారు.

రుణం మాఫీ కావడంలేదని రైతుల ఆందోళన



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

మామడ: మండలంలోని పొనకల్ గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో తీసుకున్న వ్యవసాయ రుణాలు మాఫీ కావడంలేదని రైతులు బ్యాంకు ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. ప్రభుత్వం మొదటి విడతలో లక్ష రూపాయల వరకు ఉన్న రుణాలు మాఫీ చేయగా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో రూ.60 వేల వరకు మాత్రమే మాఫీ కావడంపై ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న వ్యవసాయ అధికారులు వినోద్, సుష్మిత బ్యాంకుకు చేరుకుని అధికారులతో రైతులతో మాట్లాడారు. రైతు రుణాలకు సంబంధించి పాత లిస్టును పంపించడంతోనే ఇలా జరిగిందన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని బ్యాంక్ అధికారులు హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. సమస్యను తొందరగా పరిష్కరించాలని, లేదంటే ఆందోళ ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎస్పీ జానకీషర్మిల



చెక్కును అందిస్తున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల తెలిపారు. అనారోగ్యంతో మరణించిన హోంగార్డ్ కుటుంబాలకు పోలీస్ భద్రత నిధి నుంచి మంజూరైన చెక్కులను పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం అందజేశారు. జిల్లా ప్రధాన పోలీస్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వెన్నెల రాధ, గోపు వినోద్ అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబాలకు హోంగార్డ్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.15 వేల చొప్పున మంజూరు కాగా, చెక్కులను ఎస్పీ బాధిత కుటుంబాలకు అందించారు. శాఖాపరంగా రావాల్సిన బెనిఫిట్లను కూడా త్వరగా అందేలా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, జిల్లా హోంగార్డ్ ఇన్‌చార్జీలు ఆర్ఐ రామ్‌నిరంజన్, ఆర్ఎస్ఐ సాయికృష్ణ, ఏవో యూనుస్ అలీ తదితరులు పాల్గొన్నారు.

'కడెం'కు తగ్గిన ఇన్‌ఫ్లో



గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీళ్లు

కడెం: కడెం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గింది. సోమవారం ప్రాజెక్టుకు 4,859 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, అధికారులు ఒక వరద గేటు ద్వారా 3,002 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 700(7.603టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 691.250(5.525 టీఎంసీ) అడుగులు ఉంది.

చెరువుల్లోకి మీనం..!

- చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- నేడు టెండరు ఖరారు
- మత్స్యకారుల్లో ఆనందం
- ఆగస్టు మొదటి వారంలో పంపిణీ

వివరాలు:
జిల్లాలోని మత్స్యకార సంఘాలు : 139
సభ్యులు : 8301
సీజనల్ చెరువులు : 563
శాశ్వత చెరువులు : 81
జలాశయాలు : 05
35 నుంచి 40 ఎంఎంల చేపలు : 2.66 కోట్లు
80 నుంచి 100 ఎంఎంల చేపలు: 2.09 కోట్లు

నిర్మల్‌చైన్‌గేట్: మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా చెరువుల్లో చేప పిల్లల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంపై కొన్నాళ్లు నీలినీడలు కమ్ముకున్నా.. ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలని నిర్ణయించడంతో మత్స్యకారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. గత ప్రభుత్వం విధించిన నిబంధనల్లో కొన్ని మార్పులు చేస్తూ టెండర్ల నిర్వహణకు ప్రభుత్వం ప్రకటన ఇచ్చిందని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు.

4.75 కోట్ల చేపపిల్లలు..

వచ్చే నెలలో జిల్లాలోని జలాశయాలు, చెరువులు, కుంటల్లో 4.75 కోట్ల చేప పిల్లలను ఉచితంగా వదిలే అవకాశం ఉంది. ఈసారి వర్షాలు ఆలస్యం కావడం, చెరువుల్లో నీటిమట్టం తక్కువగా ఉండటంతో పథకం కొనసాగింపుపై ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెల్లడించక పోవడం తదితర కారణాలతో చేపపిల్లల పంపిణీ ఆలస్యంగా ప్రారంభమైంది. గతంలో జూన్, జూలైలోనే చెరువుల్లో చేప పిల్లలను వదిలేవారు. ఫిబ్రవరి నెలాఖరు నుంచే చేపలు పట్టడం ప్రారంభమయ్యేది. కానీ ఈ ఏడాది ఆలస్యంగా పంపణీ చేయడంతో ఎదుగుదల ఆశించిన మేరకు ఉండదని మత్స్యకారులు పేర్కొంటున్నారు.



చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారుడు

నేడు టెండర్లు ఖరారు...

చేప పిల్లలను సరఫరా చేసేందుకు రాష్ట్ర మత్స్యశాఖ నోటిఫికేషన్‌ను 10న విడుదల విడుదల చేసింది. 15 నుంచి ఆన్‌లైన్‌లో టెండర్లు దాఖలు చేశారు. 23న మధ్యాహ్నం 3 గంటల వరకు చేప పిల్లలను ప్రభుత్వ ధరలకు సరఫరా చేసే వ్యాపారులు టెండర్లు వేసుకునే అవకాశం ఇచ్చింది. బిడ్ అమౌంట్ రూ.25 వేలు చెల్లించాల్సి ఉంటుంది. అదే రోజు 3.30 గంటలకు బిడ్ ఓపెన్ చేస్తారు.

నాలుగు రకాల చేప పిల్లలు..

ఈ ఏడాది జిల్లాకు కట్ల, రహు, బంగారుతీగ, బ్రిగల రకాల చేప పిల్లలను ఇవ్వాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఆయా రకాల చేప విత్తనాల కోసం టెండర్ల ప్రక్రియ ఆన్‌లైన్ విధానంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించారు. టెండర్ దక్కించుకున్న వారు అవసరమైన చేపపిల్లలు సరఫరా చేసే అవకాశం కల్పిస్తారు.

139 మత్స్య సహకార సంఘాలు..

జిల్లాలో 139 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా, ఇందులో 8,301 మంది సభ్యులున్నారు. ఈ ఏడాది మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ఆధ్వర్యంలో 475.711 లక్షల చేప పిల్లలను గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల పరిధిలో గుర్తించిన 658 చెరువులు, కుంటల్లో పెంచాలని నిర్ణయించారు. జూలై నెలాఖరులోగా చేప పిల్ల లను వదిలితే, బాగా పెరిగే అవకాశం ఉంది. ఆలస్యంగా వదలడం వల్ల అవి పెరిగే సమయానికి చెరువుల్లో నీళ్లు తగ్గిపోయి పెరుగుదల సరిగా ఉండదని మత్స్యకారులు పేర్కొంటున్నారు. అలాగే.. జిల్లాలో స్థానికంగా విక్రయించే చేపలు, ఎక్కువ డిమాండ్ ఉండే రకాలను సరఫరా చేయాలని వారు కోరుతున్నారు. చేప పిల్లల సైజు సరిగా లేకపోవడం సకాలంలో సరఫరా చేయకపోవడంతో అవి పెరగడం లేదని పేర్కొంటున్నారు. చేప పిల్లలను ఆలస్యంగా చెరువుల్లో వేస్తే.. పెరగడానికి 15–18 నెలలవుతుందంటున్నారు. నిబంధనల మేరకు కాంట్రాక్టర్లు 35–40 ఎంఎం సైజుతో కొన్ని, 82–100 ఎంఎం సైజులో మరి కొన్ని చేప పిల్లలను సరఫరా చేయాల్సి ఉంటోంది. అయితే.. కాంట్రాక్టర్లు వాటి కంటే తక్కువ సైజులో ఉన్న చేప పిల్లలను, ఎదుగుదల లేని రకాలను సరఫరా చేస్తున్నారని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు.

కమిటీ సమక్షంలో టెండర్లు ఓపెన్.

కలెక్టర్ అభిలాష అభినవ్ దిశానిర్దేశంతో జిల్లా మత్స్యశాఖ అధికార యంత్రాంగం చేప పిల్లలను పంపిణీ చేసే టెండర్ల ప్రక్రియ కొనసాగనుంది. అయితే కలెక్టర్ ఆదేశాల మేరకు టెండర్ల కమిటీ చైర్మన్‌గా జిల్లా అడిషనల్ కలెక్టర్, మెంబర్ కం కన్వీనర్ జిల్లా మత్స్యశాఖ అధికారి విజయ్‌కిరణ్‌కార్, సభ్యులుగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, ఈడీఎం, ఇరిగేషన్ ఈఈలు ఉంటారు. ఆ కమిటీ ఆధ్వర్యంలో చేప పిల్లల టెండర్లు, మత్స్యకారులకు పంపిణీ, చెరువుల్లో వదిలేంత వరకు వారి పర్యవేక్షణలో కొనసాగుతుంది.

పారదర్శకంగా చేప పిల్లల పంపిణీ..



జలాశయాలు, చెరువుల్లో సగానికిపైగా నీరు చేరిన తర్వాత చేప పిల్లలను పంపిణీ చేస్తాం. చేపపిల్లల సరఫరాకు రాష్ట్ర మత్స్యశాఖ ఆదేశాల మేరకు టెండర్లు పిలిచాం. ఈ నెల 23న మధ్యాహ్నం 3 గంటల వరకు సమయం ఉంటుంది. అదే రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు బిడ్ ఓపెన్ చేస్తారు. చేప పిల్లలను సరఫరా చేసే వ్యాపారులు పారదర్శకత పాటించాలి.

– విజయ్ కరింకర్, జిల్లా మత్స్యశాఖ అధికారి

ప్రజల 'వాణి' విని.. భరోసా ఇచ్చి..



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

- సమస్యల పరిష్కారానికి కలెక్టర్ హామీ
- అర్జీలు పెండింగ్‌లో పెట్టొద్దని అధికారులకు ఆదేశం

నిర్మల్‌చైన్‌గేట్: వివిధ సమస్యలపై అర్జీలు చేతపట్టుకుని కలెక్టరేట్‌కు వచ్చిన వారి వాణి కలెక్టర్ అభిలాష అభినవ్ స్వయంగా విన్నారు. ప్రజావాణిలో భాగంగా కార్యాలయానికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీదారులతో ఓపికగా మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. తర్వాత పరిష్కారానికి భరోసా ఇచ్చారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి ఇలా సాగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు కలెక్టర్‌కు అర్జీలు సమర్పించి తమ సమస్యను విన్నవించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు, అలాగే సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల వారీగా కోర్టు కేసులకు సంబంధించిన వివరాలను సమర్పించాలన్నారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి జిల్లా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, డబుల్‌బెడ్రూం ఇళ్లు తదితర సమస్యలపై ఎక్కువగా అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- ఉపాధి హామీ కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్ల తమకు రెండు నెలలుగా వేతనాలు రావడంలేదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.
- జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న హాస్టల్ భవనాన్ని తిరిగి డిగ్రీ కళాశాలకు అప్పగించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. 2010లో యూజీసీ తరఫున డిగ్రీ కళాశాలలో ఉమెన్స్ హాస్టల్ కోసం రూ.కోటి మంజూరయ్యాయని 2016లో నిర్మల్ జిల్లాగా ఏర్పడడంతో ఏఆర్ భద్రత సిబ్బంది (పోలీసులు)కి తాత్కాలికంగా ఆ హాస్టల్ భవనం కేటాయించారన్నారు. ఎనిమిదేళ్లు గడిచినా ఏఆర్ సిబ్బంది హాస్టల్ భవనాన్ని ఖాళీ చేయడం లేదని తెలిపారు. అందుబాటులో హాస్టల్ లేనందున డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల అడ్మిషన్లు తగ్గుతున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.
- 1970లో అప్పటి ప్రభుత్వం నిర్మల్ రూరల్ మండలం వెంగ్వాపేట్‌కు చెందిన గంగపుత్రులైన 36 మందికి భూమి కేటాయించారు. ఇందుకు సంబంధించి సేత్వార్ నంబర్ సంపాదించామని 4849/1965 ప్రకారం భూములకు పట్టాలు కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు.
- భారత జాతీయ కాంగ్రెస్, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను బీసీఏ లో చేర్చాలని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని కోరారు.

శకటాల డబ్బులు ఇప్పించాలి..

2023 జనవరి 26, ఆగస్టు 15న డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటాల డబ్బులు ఇప్పించాలి. పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగిన ఎటువంటి ప్రయోజనం లేదు.

– శ్రీధర్, ఐప్లెక్ నిర్వాహకుడు

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలి

స్థానిక రామ్‌నగర్‌కు చెందిన 109 కుటుంబాలకు గత ప్రభుత్వం సిద్దాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి లక్కీడ్రా ద్వారా ఎంపిక చేసింది. కానీ, ఇప్పటికీ ఇళ్లు అప్పగించలేదు. సదుపాయాలు కల్పించి ఇళ్లు కేటాయించాలి.

– రాహుల్‌వార్ వాసు, ఆదర్శ నగర్

పునరావాస గ్రామాల్లో సౌకర్యాలు కల్పిస్తాం

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: కడెం మండలం కొత్త మద్దిపడగ గ్రామంలో పునరావాసితులైన మైసంపేట్, రాంపూర్ గ్రామాల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ అభిలాషఅభినవ్ హామీ ఇచ్చారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయా శాఖల అధికారులు, గ్రామస్తులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పునరావాస ప్రజలకు పరిహారం కింద ఇచ్చిన భూములను రక్షించుకోవాలన్నారు. భూములను అమ్మడం, తనఖా పెట్టడం చెల్లదన్నారు. భూములు చదును చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ వర్షాకాలం నుంచే వ్యవసాయం మొదలు పెట్టాలన్నారు. బ్యాంకర్లతో మాట్లాడి రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరికీ బ్యాంకుఖాతా తెరిపిస్తామని తెలిపారు. అధికారులంతా పునరావాస ప్రజలకు తోడ్పాటు అందించాలన్నారు. విద్య, వైద్యం, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, అటవీ అధికారి ప్రసాద్, ఆర్డీవో రత్నకళ్యాణి, జెడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఎంహెచ్వో ధనరాజ్, డీడబ్ల్యూవో నాగమణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్ ఆవిష్కరణ

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో 'ఇంటింటా ఇన్నోవేటర్ –2024' 6వ విడత కార్యక్రమం పోస్టర్‌ను కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజల ఆవిష్కరణ, నైపుణ్యాలు వెలికి తీసేందుకు ఇంటింటా ఇన్నోవేటర్ తోడ్పడుతుందన్నారు. సమస్య పరిష్కారానికి నూతన ఆవిష్కరణలు పుట్టుకొస్తాయని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఆవిష్కర్తల మధ్య ఆరోగ్యవంతమైన పోటీ ఏర్పడుతుందన్నారు. ఆసక్తిగలవారు తమ నూతన ఆవిష్కరణలను ఆగస్టు 3వ తేదీలోపు 9100678543 అనే నంబరుకు ఫోన్ చేసి పేరు చిరునామా, ఆవిష్కరణకు సంబంధించిన వివరాలు, ఫొటోలు, సంబంధిత వివరాలను వీడియో రూపంలో తీసి వాట్సప్ చేయాలన్నారు. ఆగస్టు 15న ఆవిష్కరణల ప్రదర్శన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసి, ఉత్తమ ఆవిష్కరణలను ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేస్తామని వివరించారు. ఆవిష్కర్తలను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఏవో అంజిప్రసాద్, డీఈవో రవీందర్‌రెడ్డి, డీపీఆర్వో విష్ణువర్ధన్, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సన్మానం

నిర్మల్‌చైన్‌గేట్: నీటి పారుదల శాఖ ఇరిగేషన్ సర్కిల్ ఆఫీస్, ఇరిగేషన్ డివిజన్ ఆఫీస్, క్వాలిటీ కంట్రోల్ డివిజన్ ఆఫీస్‌లో బదిలీ అయిన ఉద్యోగులకు ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో సోమవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజినీర్ మస్తార్‌రావు, లక్ష్మి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వర్షానికి కూలిన ఇల్లు



ఇంటి ఎదుట బాధిత కుటుంబ సభ్యులు

కడెం: ఇటీవల కురుస్తున్న వర్షాలకు సోమవారం మండలంలోని కన్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నక్యాంప్ గ్రామానికి చెందిన సంఘం మల్లేశ్ ఇల్లు కూలిపోయింది. సంఘటన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఇల్లు కూలిపోవడంతో రోడ్డున పడ్డామని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. కాలనీకి చెందిన మాలకొండయ్య ఇటీవల ఇంటికి తాళం వేసి ఆంధ్రాలో ఉన్న తన స్వగ్రామానికి వెళ్లాడు. గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంటితాళం పగులగొట్టి బీరువాలో ఉన్న 5 మాసాల బంగారం ఎత్తుకెళ్లినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. మాలకొండయ్యకు వరుసకు సోదరుడైన చిన్నబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదే కాలనీలోని కామోజి శ్రీనివాస్‌తో పాటు చిలుకూరి విజయప్రకాశ్‌లకు చెందిన మరో రెండిళ్లలో సైతం చోరీకి యత్నించినట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం సీఐ సైదారావు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కాగా విజయప్రకాశ్ ఇంటి ఆవరణలోని సీసీ ఫుటేజీలో నిందితుడు చోరీకి యత్నించిన ఫుటేజీని సేకరించినట్లు తెలిపారు.

గడ్‌చాందలో పట్టపగలే..

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాందలో పట్టపగలే చోరీ జరిగిందని ఏఎస్సై దిగంబర్ తెలిపారు. గ్రామానికి చెందిన అంబకంటి లావణ్య ఆదివారం ఉదయం ఇంటికి తాళం వేసి ముధోల్ వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరి కి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా సామగ్రి చిందరవందర చేసి ఉంది. బీరువాలో ఉన్న 35 గ్రాముల బంగారం, రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

గుట్కా పట్టివేత

ఇంద్రవెల్లి: మండలంలోని శంకర్‌గూడలో నర్వటే ఆకాష్ పాన్‌షాపు వద్ద సోమవారం రూ.29,600 విలువైన గుట్కా పట్టుకున్నట్లు ఎస్సై దుబ్బక సునీల్ తెలిపారు. గుట్కాను స్వాధీనం చేసుకుని ఆకాష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

14 మందిపై కేసు

నేరడిగొండ: ఇస్పూర్‌లో ఇంటి దగ్గర దారి విషయంలో ఇరు వర్గాల మధ్య గొడవ చోటు చేసుకుంది. సోమవారం ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 14 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని జాతీయ రహదారి 44పై కారును బస్సు ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై జహీరుద్దీన్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన మహమ్మద్ ఏకే శ్యాం సోమవారం బోరి నుంచి కిన్వట్‌కు వెళ్తుండగా జీఎంఆర్ ఆయిల్ సాల్వెంట్ సమీపంలో కారును ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. దీంతో కారు వెనుకభాగం దెబ్బతింది.

వాహనం ఢీకొని జింక మృతి

ఇచ్చోడ: మండలంలోని కుప్టిఘాట్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. సంఘటన స్థలానికి పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ వెళ్లి పంచనామా నిర్వహించారు.

సర్కారు బడుల్లో శిక్షా సప్తాహ్

- వారం రోజులపాటు వివిధ కార్యక్రమాల నిర్వహణ
- విద్యార్థుల్లో వినోదం, విజ్ఞానం పెంచేలా ప్రత్యేక ప్రణాళిక

ఆదిలాబాద్‌టౌన్/మంచిర్యాలఅర్బన్/నిర్మల్‌ఖిల్లా: నూతన విద్యావిధానం అమలులోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని సర్కారు బడుల్లో సోమవా రం నుంచి ఈనెల 29 వరకు శిక్షా సప్తాహ్ (విద్యావారోత్సవాలు) నిర్వహిస్తున్నారు. వారం రోజుల పాటు రోజుకో విధంగా కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. బోధనకు ఆటంకం కలుగకుండా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులు ఉపాధ్యాయులను ఆదేశించారు. అయితే ఈ కార్యక్రమాలకు సంబంధించి తీసిన ఫొటోలకు జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. వీటిని గూగుల్ డ్రైవ్‌లో అప్‌లోడ్ చేయాలని సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు పేర్కొంటున్నారు. విద్యార్థుల్లో వినోదంతో పాటు విజ్ఞానం పెంపొందించేలా కార్యక్రమాలు రూపొందించేందుకు చర్యలు చేపడుతున్నారు.

రోజువారీ కార్యక్రమాలు ఇవే..

శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా రోజుకో విధమైన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉమ్మడి జిల్లాలోని ఆయా పాఠశాలల్లో నీటిని ఆదా చేయడం, ఇతరులకు సహాయం చేయాలనే అంశంపై టీఎం మేళా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆహారం, కూరగాయలు, వ్యర్థాలతో బొమ్మల తయారీని చార్ట్‌ల రూపంలో ప్రదర్శించారు.

- 23న పాఠశాలల్లో అమలు చేస్తున్న న్యూమరసీ ఫండమెంటల్ లిట్రసీ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమానికి సంబంధించి ఉపాధ్యాయుల బోధన పద్ధతులను ప్రదర్శించనున్నారు. సదస్సులు నిర్వహించి విద్యార్థులకు కథలు చెప్పాల్సిఉంటుంది.
- 24న క్రీడా దినోత్సవం నిర్వహించాలి. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ఆటలు ఆడించడం, క్రీడలతో కలిగే ప్రయోజనాలు వివరించనున్నారు.జట్టు ఆడే ఆటల్లో ఫలితాలు విజయం దిశగా ఉంటాయని, క్రీడలతో మానసిక ఎదుగుదల, శారీరక దృఢత్వం గురించి తెలియజేయనున్నారు.
- 25న సాంస్కృతిక దినోత్సవం నిర్వహించాలి. ఇందులో భాగంగా వివిధ భాషలు, వేషధారణ, సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. వస్త్రధారణ, చిత్రలేఖనం, జానపద, నాటకాలు విద్యార్థులతో వేయించాలి. ఏకపాత్రాభినయం, పాటల పోటీలు నిర్వహించాలి.
- 26న సాంకేతిక నైపుణ్య దినోత్సవం నిర్వహించాల్సి ఉంది. ఇందులో కోడింగ్ ఛాలెంజ్, జీవధారణ కార్యక్రమాలు, పక్షు, జంతువులపై అవగాహన, విద్యార్థులకు చారిత్రక విషయాలను తెలియజేయడం, వర్క్‌షాప్ నిర్వహించాల్సి ఉంటుంది. విద్యార్థులను చారిత్రాత్మక ప్రదేశాలకు తీసుకెళ్లి వాటి గురించి వివరిస్తారు.
- 27న పాఠశాలల్లో పోష్టికాహార దినోత్సవం నిర్వహించాలి. విద్యార్థులతో ఏకో క్లబ్‌లను ఏర్పాటు చేయాలి. క్లబ్‌ల ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహించేలా చూడాలి. మొక్కల పెంపకం, కూరగాయల తోటల పెంపకం చేపట్టాలి. మొక్కలు నాటి వాటిని సంరక్షించేలా చూడాలి.
- 29న సామాజిక భాగస్వామ్య దినోత్సవం నిర్వహించాలి. అందర్నీ ఇందులో భాగస్వామ్యం చేయాలి. తల్లిదండ్రులు, దాతలను బడికి ఆహ్వానించి కార్యక్రమాలు చేపట్టాలి. పాఠశాలల్లో చేపడుతున్న కార్యక్రమాలు వివరించాలి. పాఠశాల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యం పెంపొందించేలా చర్యలు చేపట్టాలి.



ప్రదర్శనలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

జిల్లా	ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత	విద్యార్థులు
ఆదిలాబాద్	466	107	105	65,000
మంచిర్యాల	510	96	108	29,376
నిర్మల్	533	85	117	52,667
కుమురంభీం	560	102	58	36,000

తప్పనిసరిగా నిర్వహించాలి



జిల్లాలోని ప్రతీ పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలి. ఈ నెల 22 నుంచి 29 వరకు వారం రోజుల పాటు రోజుకో కార్యక్రమాలను చేపట్టాలి. విద్యార్థులకు అవగాహన కల్పించాలి. అమ్మ ఆదర్శ కమిటీలను, తల్లిదండ్రులు, దాతలను ఈ కార్యక్రమాల్లో భాగస్వాముల్ని చేయాలి. నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించి ఫొటోలు, వీడియోలకు జియో ట్యాగింగ్ చేయాలి. నివేదికను పంపించాలి.

– ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్

విద్యార్థుల భాగస్వామ్యం తప్పనిసరి...



'శిక్షా సప్తాహ' వారోత్సవాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతీ విద్యార్థిని భాగస్వామ్యం చేసేలా ప్రోత్సహించాలి. రోజుకొక విభిన్న ఇతివృత్తంతో నిర్వహించే కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో చైతన్యం రగిలించాలి. ఇందులో విద్యార్థులు సృజనాత్మకత, విభిన్న ఆలోచన శక్తిని పొందుతారు. ఏడు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గ నిర్దేశం చేయాలి.

– డా.ఎ.రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

మంచిర్యాలలో..

గర్మిళ్ల పాఠశాలలో సోమవారం టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం) దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా వినూత్నంగా బోధన సామగ్రి తయారు చేయడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని టీఎల్ఎంగా మలుచుకోవడంతో పాటు విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. ఆహారం-కూరగాయలు అనే అంశంపై ప్రదర్శించారు.

బీఎడ్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బీఎడ్ కళాశాలలో 2024–26 విద్యా సంవత్సరానికి గానూ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణితంలో 25 సీట్లు, జీవశాస్త్రంలో 20, సాంఘిక శాస్త్రం 35 , భౌతిక రసాయన శాస్త్రం 10, ఆంగ్లం 10 సీట్లకు గానూ రాష్ట్రంలో అర్హతగల గిరిజన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారాలను రూ. 100 చెల్లించి కళాశాల పనిదినములలో అభ్యర్థులు ఈనెల 24 నుండి వచ్చే నెల 23 వరకు పొందవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు ఆగస్టు 23 సాయంత్రం 5గంటలలోపు సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు 94408 48073 నంబరులో సంప్రదించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల ఉంచి అర్జీలు స్వీకరించారు. జన్నారం మండలం కామన్‌పల్లికి చెందిన అమృత చికిత్స నిమిత్తం ఆర్థికసాయం అందించాలని, బజార్‌హత్నూర్ మండలం ముర్గండికి చెందిన గంగ కారుణ్య నియామక ఉద్యోగం ఇప్పించాలని, తదితర సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో జీసీసీ మేనేజర్ రామానందన్, అదనపు వైద్యాధికారి మనోహర్ పాల్గొన్నారు.

గ్రంథాలయం సందర్శన

ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని హైమన్‌డార్ఫ్ గ్రంథాలయాన్ని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సందర్శించారు.

రిమ్స్‌లో బదిలీలు

- ఏడుగురు వైద్యులకు స్థానచలనం
- ఆ స్థానంలో కొత్త డాక్టర్లను నియమించని వైనం

ఆదిలాబాద్‌టౌన్: మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మారింది రిమ్స్ ఆస్పత్రి పరిస్థితి. ఇప్పటికే వైద్యుల ఖాళీలతో సతమతం అవుతుండగా గతేడాది రిమ్స్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసిన అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రెగ్యులర్ పోస్టులు రావడంతో దాదాపు 20 మంది రిమ్స్ నుంచి వెళ్లిపోయారు. ఇప్పుడేమో సాధారణ బదిలీల్లో భాగంగా ఏడుగురు వైద్యులు బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఒక్క వైద్యుడిని కూడా కేటాయించకపోవడంతో రిమ్స్‌లో వైద్య సేవలకు ఆటంకం కలిగే పరిస్థితి ఏర్పడింది. వైద్యం పడకేయనుండగా, బోధన అటకెక్కే పరిస్థితి నెలకొంది. ఆయా విభాగాల ప్రొఫెసర్లను బదిలీ చేయడంతో ఇబ్బందులు తలెత్తనున్నాయి. కాగా ఈ బదిలీల్లో నలుగురు ప్రొఫెసర్లు, ముగ్గురు అసోసియేషన్ ప్రొఫెసర్లను డీఎంఈ బదిలీ చేసింది. వీరు రిలీవ్ అయిన తర్వాత ఇక్కడ రోగులతో పాటు వైద్య విద్యార్థులకు సైతం ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఏర్పడనుంది. ప్రస్తుతం 40 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాల్సిన ప్రభుత్వం ఉన్న వారిని ఇక్కడి నుంచి వేరే జిల్లాలకు బదిలీ చేయడం పట్ల జిల్లా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బదిలీ జరిగిన పోస్టులతో పాటు ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏడుగురికి స్థానచలనం..

ఆప్తాలమిక్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఇద్రిస్ అక్బానికి నిర్మల్ జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాలకు బదిలీ చేశారు. ప్యాథాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్ గాంధీ మెడికల్ కళాశాల హైదరాబాద్‌కు బదిలీ చేశారు. అనస్తీషియా విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎస్.చంద్రశేఖర్‌ను ఉస్మానియా మెడికల్ కళాశాలకు, ఫార్మాకాలజీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న లక్ష్మీపతిని వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలకు, బయోకెమిస్ట్రీ అసోసియేషన్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ప్రజ్ఞను గాంధీ మెడికల్ కాలేజీకి, ఆర్థో విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌ను నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు, జనరల్ మెడిసిన్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సుమలతను నిర్మల్ మెడికల్ కళాశాలకు బదిలీ చేశారు.

ఆర్టీసీకి పెరిగిన ప్రజాదరణ

- ఉమ్మడి జిల్లాలో 3.57 కోట్ల మందికి 'జీరో' టికెట్లు
- ప్రయాణికుల సంఖ్యకనుగుణంగా బస్సులు
- కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక దృష్టి
- రీజినల్ మేనేజర్ సోలోమాన్



మాట్లాడుతున్న ఆర్ఎం సోలోమాన్

కైలాస్‌నగర్: ఆర్టీసీకి ప్రజల్లో ఆదరణ పెరిగిందని దీంతో అక్యుపెన్సీ రేషియో(ఓఆర్) 90శాతం నమోదవుతుందని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది డిసెంబర్‌లో మహాలక్ష్మి పథకం అమలు చేసినప్పటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. రీజియన్‌లోని ఆరు డిపోల పరిధిలో 612 బస్సులుండగా నిత్యం 2.70 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారన్నారు. ఇందులో 1.50 లక్షల మంది మహిళలు ఉంటున్నట్లుగా తెలిపారు. కొన్ని బస్సుల్లో 95 నుంచి 100శాతం ఓఆర్ నమోదవుతుందన్నారు. మహాలక్ష్మి పథకం ప్రారంభం నుంచి గడిచిన 218 రోజుల్లో 3కోట్ల 57లక్షల 54వేల 336 మంది మహిళలు ప్రయాణించగా వారికి జీరో టికెట్లు జారీ చేశామన్నారు. అలాగే డబ్బులు చెల్లించి 2కోట్ల 50లక్షల 59వేల172 మంది ప్రయాణించినట్లుగా తెలిపారు. ప్రయాణికుల సంఖ్యకనుగుణంగా బస్సులను నడుపుతున్నట్లుగా తెలిపారు. గతంలో కిలో మీటర్‌కు రూ.43.20 ఆదాయం రాగా, మహాలక్ష్మి అమలు నుంచి కిలో మీటర్‌కు రూ.57.28 ఆదాయం వస్తుందని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తు గ్రాండ్ హెల్త్ చాలెంజ్ ట్రూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. ఇందులో భాగంగా కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదిలాబాద్, మంచిర్యాలలోని డిస్పెన్సరీల్లో వైద్యసేవలందిస్తున్నట్లుగా తెలిపారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తార్నాకలోని ఆసుపత్రికి పంపిస్తున్నట్లుగా పేర్కొన్నారు. అక్కడ కొత్తగా ఎంఆర్ఐ, ఐసీయూ సేవలు కూడా అందుబాటులోకి వచ్చినట్లుగా తెలిపారు. కార్మికులు ప్రయాణికులతో మర్యాదగా నడుచుకుంటూ మరింత ఆదాయం పెంచేలా శ్రద్ధ వహించాలని కోరారు. ప్రయాణికులు కూడా సంస్థను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ వైర్లు పట్టుకుని ఆత్మహత్య



సంఘటన స్థలంలో మృతదేహం

కుభీర్: మండలంలోని సిస్పెల్లి(హెచ్)గ్రామానికి చెందిన జాదవ్ మారుతి అప్పులబాధతో సోమవారం విద్యుత్ వైర్లు పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పి.రవీందర్ తెలిపారు. మృతుడు తనకున్న ఎకరంనర భూమిని సాగు చేసుకుని ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం రూ.3 లక్షల వరకు బ్యాంకు, ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పుచేసి కూతురు వివాహం చేశాడు. అప్పులు ఎలా తీర్చాలని రెండు రోజులుగా మదనపడుతున్నాడు. సోమవారం పల్సి తండా వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి వైర్లు పట్టుకోవడంతో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్ బస్టాండ్ వద్ద నిర్మల్–భైంసా రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒల్లెపు సాయవ్వ (70) మృతి చెందింది. నర్సాపూర్(జి) మండలంలోని రాంపూర్‌లో ఉన్న బంధువుల ఇంటికి రాగా ఆమె మనుమడు రాజు ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి తీసుకెళ్తుండగా కారు ఢీకొట్టింది. ఘటనలో వృద్ధురాలి తలకు బలమైన గాయం కావడంతో నిర్మల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నిర్మల్ రూరల్: కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వెనుక ఉన్న డ్రెయినేజీలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి (35) మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్సై సాయికుమార్ తెలిపారు. మృతుడు నల్లరంగు ప్యాంటు, నీలంరంగు చొక్కా ధరించి ఉన్నాడన్నారు.

ఇద్దరు దొంగల రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: మార్కెట్ యార్డులో చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కరుణాకర్ రావు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన పాత నేరస్తుడు టింపు సురేష్, దొడ్ల మల్ల య్య అలియాస్ పాప ఈనెల 11న రాత్రి మా ర్కెట్ యార్డులోని ఆరు గోదాముల తాళాలు పగలగొట్టారు. పాత సామాగ్రి, నల్లాలు దొంగిలించి రూ.6వేలకు విక్రయించారు. ఫింగర్‌ప్రింట్స్ ద్వారా నేరస్తులను గుర్తించి అరెస్టు చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన సుంకరి వెంకటి (70) సోమవారం మృతి చెందినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. శుక్రవారం కాలనీలోని ఓ ఆలయం వద్ద కిందపడి ఉన్న వృద్ధుడిని 108లో రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో ఐదు గేదెలు మృతి

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కుర్తి పంచాయతీ పరిధిలోని చింతల్‌పేట్ గోదావరి తీరంలో విద్యుదాఘాతంతో ఐదు గేదెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన కాపరులు నర్సయ్య, కొండ రాజేశ్వర్ ఆదివారం గేదెలను మేతకు తీసుకెళ్లగా గోదావరి నీటిలో దిగిన సమయంలో సమీపంలోని ఒడ్డున గల మోటార్‌ల నుంచి వాటికి విద్యుత్ సరఫరా కావడంతో ఐదు గేదెలు మృతి చెందాయి. ఒక్కో గేదె విలువ రూ.50 వేలు ఉంటుందని గేదెల యజమానులు ఏ శంకర్, నాగుల రాజాగౌడ్, అలిశెట్టి బుచ్చన్న, అలిశెట్టి లచ్చ న్న, గొల్లపెల్లి నర్సయ్య పేర్కొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

తాంసి: భీంపూర్ మండలంలోని తాంసి(కె) శివారులో నుంచి ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు భీంపూర్ ఎస్సై కలీం తెలిపారు. అనంతరం మైనింగ్ అధికారులకు సమాచారం అందించారు. కొంత కాలంగా పెన్‌గంగ నది ఇసుకను తవ్వి మహారాష్ట్రకు తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముడుపులు అందించడంతోనే ఇసుక దందా యథేచ్ఛగా కొనసాగుతుందని ప్రచారం జరుగుతోంది.

పెన్‌గంగలో ఒకరి గల్లంతు



శివ అలియాస్ కార్తీక్ (ఫైల్)

జైనథ్: మండలంలోని డొల్లార గ్రామ సమీపంలో పెన్‌గంగలో ఓ యువకుడు గల్లంతైనట్లు పోలీసులు తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ మండలం చాంద(టి) గ్రామానికి చెందిన కే.శివ అలియాస్ కార్తీక్, జైనథ్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కట్కం అక్షయ్, రాచర్ల రఘు ఆదివారం మహారాష్ట్రలోని పాందర్‌కొడకు వెళ్లారు. రాత్రి తిరుగు ప్రయాణంలో డొల్లార వద్ద పెన్‌గంలో నది ఒడ్డును కూర్చొని మద్యం సేవించారు. మద్యం మత్తులో శివ, రఘు ఒకరికి తెలియకుండా మరొకరు పెన్‌గంగలో స్నానానికి దిగారు. కొంత సేపటి తరువాత రఘు బయటకు వచ్చి చూడగా అక్షయ్ మాత్రమే కనిపించడంతో శివ గురించి అడిగాడు. అయితే శివ కూడ నదిలోనే దూకాడని తెలియడంతో మద్యం మత్తులోనే అతడి కోసం గాలించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సోమవారం కేసు నమోదు చేసుకొని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. శివ పెన్‌గంగలో గల్లంతయ్యాడా? లేదంటే ఇంకా ఏమైన జరిగి ఉంటుందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం ఎస్పీ గౌస్ ఆలం సంఘటన స్థలానికి చేరుకొని, వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాత్రి వరకు గాలింపు చర్యలు ముమ్మరంగా నిర్వహించినప్పటికీ కూడ శివ ఆచూకీ లభించనట్లు సీఐ సాయినాథ్ తెలిపారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై పురుషోత్తం పేర్కొన్నారు.

బ్యాంకులో సొమ్మసిల్లి పడిపోయిన రైతు

ఇంద్రవెల్లి: రుణమాఫీ డబ్బుల కోసం బ్యాంక్‌కు వచ్చిన రైతు అక్కడే సొమ్మసిల్లి పడిపోయిన సంఘటన మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు ఆవరణలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సమాక గ్రామ పంచాయతీ పరిధిలోని పాటగూడ(కే) గ్రామానికి చెందిన సిడాం రాజు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతనికి రుణమాఫీ కావడంతో కుమారుడు లక్ష్మణ్‌తో కలిసి సోమవారం బ్యాంక్‌కు వచ్చి అక్కడే సొమ్మసిల్లి పడిపోయాడు. తన తండ్రి పరిస్థితి బ్యాంక్ అధికారులకు వివరించినా తీసుకురావాలని చెప్పడంతో గ్రామానికి వెళ్లి మంచంపై అనారోగ్యంతో పడుకుని ఉన్న వ్యక్తిని ఆటోలో తీసుకువచ్చానని లక్ష్మణ్ ఆరోపించాడు.

'సదర్మాట్'కు పోటెత్తిన వరద



ఖానాపూర్: మేడంపల్లిలోని సదర్మాట్ ఆనకట్టకు జలకళ సంతరించుకుంది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువనుంచి వరద నీరు వచ్చి చేరుతోంది. సదర్మాట్ ఆనకట్ట నీటి సామర్థ్యం 12 ఫీట్లు కాగా ప్రస్తుతం 9 ఫీట్ల వరకు ఉంది. దీంతో సదర్మాట్‌ను చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు తరలివస్తున్నారు.

లక్ష్మీపూర్ రిజర్వాయర్‌కు జలకళ



జైనథ్: మండలంలో 7,600 ఎకరాల ఆయకట్టు కలిగిన లక్ష్మీపూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు జలకళ సంతరించుకుకుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పిప్పల్‌గావ్ వాగు పొంగి పొర్లుతుండటంతో ప్రాజెక్ట్‌లోకి నీళ్లు వచ్చి చేరుతున్నాయి. 250.6 మీటర్ల ఎత్తు, 153 ఎంసీఎఫ్‌టీ నీటి నిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 243 మీటర్ల ఎత్తులో 25 ఎంసీఎఫ్‌టీ నీళ్లు నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.